# సొంత ఇల్లు - అద్దె కొంప

మా అఫీసు యూనియన్ ఎలక్షన్లు ఇక పది రోజులే ఉన్నాయి. అత్యంత కీలకమైన ప్రెసిడెంటు పదవికి మా అఫీసులో ఇద్దరి మధ్య తీవ్రమైన పోటీ జరుగుతోంది.

"చూడండి జగన్నాథంగారూ! ప్రెసిడెంటు పదవి చేసేవాడికి సాధకబాధకాలు తెలిసి ఉంటేనే తప్ప తోటి ఉద్యోగుల సంరక్షణకు పోరాడలేడు. నేను అందరిలో కలిసిపోయి అందరి బాధలూ నావిగా భావించే వాడిని. ఆ సొంత ఇంటి సుబ్బారావు కేమండి అంతో ఇంతో స్థిరాస్తి కలవాడు. ఎవరు ఎలాపోతే నాకేం, పదవుంటే చాలు అనే రకం. కనుక మీరూ, మీ అనుయాయులూ నాకు ఓట్లు వేసి నన్ను గెలిపించండి." రెండు చేతులెత్తి నమస్కరిస్తూ అన్నాడు అద్దెఇంటి అప్పారావు.

అద్దెఇంటి అప్పారావు అలా మా సెక్షను దాటగానే, ఇలా సొంతఇంటి సుబ్బారావు ప్రవేశించాడు. ప్రతిఒక్క సీటు దగ్గరకూ వెళ్ళి తన ఉపన్యాసాన్ని వినిపిస్తూ చివరగా కూర్చునిఉన్న నాదగ్గరకు వచ్చాడు.

"అప్పారావు తన అర్రాటన్నంతా తమ ముందు వెళ్ళబోసుకొని ఉంటాడను కొంటాను. నేను ఉద్యోగస్థుల సాధక బాధకాలు తెలియని వాణ్ణినీ. సొంత ఇల్లుగల ధనవంతుడిననీ, తాను అద్దె కొంపలో ఉంటూ తోటి ఉద్యోగస్థుల సాధకబాధకాలు ప్రత్యక్షంగా తెలుసుకొనే నిజాయితీపరుణ్ణనీ కోతలుకోసి వెళ్ళిఉంటాడు."

కొద్ది సేపు ఆగి ఊపిరి పీల్చుకొని అన్నాడు.

"ప్రెసిడెంటు హోదాకు అవసరమైన క్వాలిఫికేషను మాటలు చెప్పడమా లేక కర్తవ్య నిర్వహణా?" అన్నాడు.

"కర్తవ్య నిర్వహణే" అన్నాను.

"ఎస్. మీరే ఒప్పుకొన్నారు. అది నాకుంది. కనుక మీతరపు ఓట్లన్నీ నాకే వేయాలి ఇక సెలవు తీసుకుంటాను" నమస్కారాలమీద నమస్కారాలు పెడుతూ వెళ్ళాడు సొంత ఇంటి సుబ్బారావు.

నేను అసిస్టెంటు సెక్షన్‌హెడ్‌ని అయి ఉండడంవల్లనయితే నేమి నేను ప్రాక్టికల్‌గా ఆలోచించడం వల్లనయితేనేమి నేనేగాక నామాటమీద ఇంకో పదిఓట్లు పడతాయని ఇరువర్గాల్లోనూ నమ్మకముంది

సదా అద్దెఇళ్ళలోని బాధలను వర్ణిస్తూండడంవల్ల అప్పారావుకు అద్దెకొంప అప్పారావని, సొంత ఇల్లు కట్టించి నప్పటి నుంచీ సుబ్బారావులో ఒకరకమైన మార్పురావడంతో అతన్ని సొంత ఇంటి సుబ్బారావని పిలవడం మాకు మామూలైపోయింది. నేను ఫైలు మూసి ఆలోచించ సాగాను.

ఎవరెన్ని చెప్పినా నాదృష్టంతా అద్దెకొంప అప్పారావుమీదే ఉంది. కారులో పోయేవాడికంటే ఎండలో నడిచేవాడికి ప్రయాణం లోని శ్రమ తెలుసు. సొంత ఇంటి సుబ్బారావుకంటే అద్దె ఇంట్లో ఉన్న అప్పారావుకే ఎక్కువ కష్టాలుండటం సహజం. అలాకష్టాలు పడేవాడేతోటి వాడి కష్టాలు అర్థం చేసుకోగలడు.

కాని సొంత ఇంటి సుబ్బారావు వెళుతూ వెళుతూ అన్న దాంట్లోకూడా కొంత లాజిక్ ఉంది. కావలసింది మాటలా కర్తవ్యమా? అన్నాడు. అదీ నిజమే! కొంతమంది మాటల్లో చెప్పినంత ఫోర్సు ప్రాక్టికల్‌గా ఉండదు. ఏది ఏమైనా ఉద్యోగస్తుల రక్షణ కోసంపాటు పడేవాడు మాకు ప్రెసిడెంటుగా ఉండాలి. వీళ్ళల్లో ఎవరు ఎంతవరకు అన్నది ప్రాక్టికల్‌గా టెస్ట్‌చెయ్యాలనుకొన్నాను

నేను ఆ ఆదివారం అద్దెకొంప అప్పారావింటికి బయలుదేరాను అప్పారావు చెప్పిన స్టాపులో బస్సు దిగి సందు మలుపు తిరిగాను. తరువాత అక్కడినుంచి పోస్టాఫీసు దాటి, కుడివైపుగా నడచి నాలుగవ ఎలక్ట్రిక్ స్తంభం దాటాను. ఎదురుగా విరిగిపోయిన ప్రహరీగోడ లోపల వరుసగా షెడ్డుల్లాఉన్న అరు రేకుల ఇళ్ళున్నాయి.

ఇంతలో అక్కడినుంచి వస్తూ ఓ పాతికేళ్ళ యువకుడు ఎదురయ్యాడు.

"అప్పారావు ఏ ఇంట్లో ఉంటున్నాడండీ?" అనడిగాను.

"ఎవరూ ...అప్పారావా? వాడిక్కడెందు కుంటాడండీ ? ముష్టివెధవ ప్లాటుఫారం మీదుంటాడుగాని!"

"ఆయన ముష్టివెధవ కాదండీ! మా అఫీసు సీనియర్ అసిస్టెంటు. మేమంతా అతన్ని అద్దెకొంప అప్పారావని అంటూంటాము"

"ఏమో ఎవడికి తెలుసు?" అంటూ వెళ్ళిపోయాడు.

ఇంతలో ఎవరిదో చెయ్యి భుజంమీద పడింది. 'ఇక్కడ కూడా జేబుదొంగ లున్నారా బాబోయ్' అనుకుంటూ భయపడ్డాను. కాని, ఆచేయి సాక్షాత్తూ నేవెతుకుతున్న అద్దెకొంప అప్పారావుది.

"రక్షించావు గదయ్యా. ఇప్పటివరకూ మీ ఇంటికోసమే వెతుకుతున్నాను"

''నేను చెప్పాను గదా జగన్నాథంగారూ, నేరుగా రాలేకపోయారా?"

''ఇదుగో అప్పారావ్. ఏవో ఎలక్షన్లుగదాని నాకు గారూగీరూ చేర్చి మాట్లాడకు. ఎప్పట్లా జగన్నాథం అని పిలుపు చాలు" అన్నాను.

నాబాధ అర్థంచేసుకొన్న అప్పారావు "అలాగే అలాగే" అంటూ తల ఊపాడు.

"ఇప్పుడు ఇటుగా వెళ్ళిన ఆ అబ్బాయెవరు?" అనడిగాను.

"వాడా? ఏం" ప్రశ్నించాడు.

"అప్పారావు ఇల్లెక్కడని అడిగితే ప్లాటుఫారంమీద ముష్టడుక్కొంటున్నాడని చెప్పాడు"

"వాడు నా సుపుత్రుడులే! వాడి పేరుకూడా అప్పారావే. వాడు నిరుద్యోగి. ఆ కడుపుమంటతో వాడు తన్ను తాను అలా పరిచయం చేసుకొని ఉంటాడు. రా వెళ్దాం ఇంట్లోకి" అంటూ ఆహ్వానించాడు.

ఇద్దరం ఇంట్లోకి వెళ్ళాము.

"కాఫీ తయారుచెయ్ వెంటనే" అంటూ తనచేతిలోని కూర కూరగాయల సంచీ భార్యకు అందించాడు.

పది నిముషాల్లో ఇద్దరికీ రెండు స్టీలు గ్లాసుల్లో కాఫీలు వచ్చాయి. ఒకదానికి అడుగు లోపలికి అతుక్కుపోయిఉంది. ఇంకొకదానికి ఒకవైపు సొట్టపోయిఉంది. 'వీడిపిండాకూడు. వీడెంత పిసినారి! ఆఖరుకి రెండు శుభ్రమైన స్టీలుగ్లాసులు కొనేశక్తికూడా లేదా?' అనుకొన్నాను.

"జాగ్రత్తగా వంగు" అన్నాడు గ్లాసు కిందపెట్టబోతుంటే.

"ఏం?" అన్నాను ఆశ్చర్యంగా.

"కుర్చీ...."

అప్పారావు కుర్చీవైపు చూశాను. దానికి మూడుకాళ్ళే ఉన్నాయి. వెనుకవుండవలసిన రెండు కాళ్ళలో ఒకటే వుంది. అయినా అప్పారావు బ్యాలన్సు మీద చాలాఫ్రీగా కూర్చుని ఉన్నాడు.

"నేను చెప్పేది నీ కుర్చీ గురించి" అన్నాడు.

ఆటంబాంబు పడ్డట్లు దూరంగా వెళ్ళి నేకూర్చున్న కుర్చీ వైపుచూశాను. దానికి రెండేకాళ్ళున్నాయి. గోడకు అనించి ఉండడం వల్ల కదలడం లేదు.

"ఇప్పుడే ఏం చూశావ్? ఇంకా చూడవలసినవి చాలా ఉన్నాయి. మధ్యాహ్నం భోజనానికి ఉండు" అన్నాడు.

"ఎందుకులే అప్పారావ్! నేను నీ అహ్వానాన్ని కాదనలేక ఇల్లు చూద్దామని వచ్చానుగాని...."

"నో....నో....రాక రాక వచ్చావు. ఉండక తప్పదు" అన్నాడు ప్రాధేయపడుతూ.

బలవంతం క్షణక్షణానికి ఎక్కువవుతుందని గమనించి "అలాగేలే" అన్నాను.

అప్పారావు అద్దె ఇంటిలోని బాధలన్నీ చెప్పుకొచ్చాడు. ఇంటికి వెల్లవేసి ఎన్నో దశాబ్దాలైనట్లు ఉంది. మొహెంజదారో, హరప్పాలలోని సింధు నాగరికతను తెలియజేస్తున్నాయి గోడలు. ఏమిటేమిటో బొమ్మలు, ఎవరెవరివో పేర్లు గోడలమీద చెక్కబడి ఉన్నాయి. అనాటి లలిత కళలను చాటి చెబుతున్నట్లు.

నా చూపులు గమనించి "మేము వెళ్ళేటప్పుడుకూడా మాకు తగ్గ ప్రావీణ్యం చూపించి మరీ వెళతాం" అన్నాడు.

"అదేం?"

"ఓనరుగాడి(ద) మీద కోపం. మేమూ తగిన నష్టంచేసి వెళతాం."

"ఎందుకని?" అన్నాను మళ్ళీ.

"ఇల్లంటూ ఒకటిచ్చి ఏడ్చాడేగాని ఎప్పుడైనా దానిబాగోగులు చూశాడా? ఇంటికి వెల్లవేయించుకోవడం, పంపుచెడిపోతే

రిపేరుచేయించుకోవడం.....ఇవన్నీ మేమే చేసుకోవాలా? ఇంటిఅద్దె మాత్రం తీసుకుపోవడానికి ఠంచనుగా హాజరు!"

"అన్నిచోట్లా అంతేలే"

"అవునవును జగన్నాథం! ఇల్లుగల ప్రతిఒక్కడూ తానేదో దేవలోకంనుంచి వచ్చినట్లు భ్రమిస్తుంటాడు. అద్దె కొంపలోఉన్న వాణ్ణి ఒక బానిసలా చూస్తాడు. నన్నడిగితే దేశంలో ఉండేది రెండే రెండు తరగతులు. ఒకటి సొంత ఇల్లుగలవాళ్ళు. రెండు అద్దె కొంపల్లో ఉండేవాళ్లు. ఈ రెండు వర్గాల పోరాటమే తర తరాలుగా జరిగేది"

"ఆకాశవాణి విజయవాడ కేంద్రం. ఇప్పుడు మీరు వార్తలు వింటారు."

ఆ గదిలో ఎదురుగా టేబులుమీదున్న రేడియో నే వచ్చిన ఈ ఇరవై నిముషాల నుంచి నిశ్శబ్దంగా ఉంది. ఒకవేళ సడన్‌గా కరెంటు వచ్చిందేమో అని అనుకొందామంటే అదికూడా కాదు. ప్లగ్ వేరుచేయబడి ఉంది. ఒకవేళ బ్యాటరీతో పనిచేసినా ఎవరైనా స్విచ్ ఆన్ చేయాలికదా!, 'నామిత్రుడు అప్పారావు మెజీషియన్ కూడా కాదే' అనుకున్నాను. నా అనుమానం గమనించి పక పకా నవ్వాడు అప్పారావు. అప్పుడు నాకు అతను నిజంగా మెజీషియనే అనిపించింది.

"ముందు వార్తలు విను" అన్నాడు.

వార్తలు వినడం మొదలు పెట్టాను రీసౌండ్‌లో వచ్చాయి వార్తలు. వార్తలు అయిన తరువాత ఎవరిదో శాస్త్రీయ సంగీతం మొదలైంది. ఆ సంగీతం చెవుల్లోని తుప్పు వదలగొడుతూ ఉంది.

రెండువేళ్ళూ చెవుల్లో ఉంచుకొని "మిత్రమా నీహిప్నాటిజమ్ శక్తితో అదిగో అకర్ణకఠోరమైన శబ్దాన్ని ఆపునాయనా" అన్నాను

"పిచ్చివాడా! రేడియో మోగేది నాయర్ నాగమణి ఇంట్లో"

"ఎవరామె?"

"ఆమె కాదు. అతను. ఈ అరిళ్ళ ఓనరు. అతనింట్లో ఒక పెద్ద సెవెంటీ ఎమ్.ఎమ్. రేడియో ఉంది. అది పద్దెనిమిదొందలా తొంభైయవ సంవత్సరం నాటిది. అది అన్ని వేళలా మోగుతూనే ఉంటుంది. పగలూ రాత్రీ భేదంలేదు. భాషా భేదం లేదు. చూశావుగా పైన గోడలకున్న కంతలు? ఆ చివరి నాగమణి ఇంట్లోంచి ఈ చివరివరకు అన్ని ఇళ్ళలోకి ప్రసారమవుతూ ఉంటాయి కార్యక్రమాలు"

"అహా!" అన్నాను తలపైకెత్తి గోడవైపు చూస్తూ.

ఇంతలో భోజనానికి పిలుపు వచ్చింది. ఇద్దరమూ భోజనాలకు కూర్చున్నాము. భోజనం వడ్డించడానికి టేబులుమీదపాత్రలు సర్దబడ్డాయి. ఏపాత్ర సక్రమంగా లేదు. వంకరటింకరగాఉన్నాయి. అన్నిపాత్రలూ సొట్టలుపోయిఉన్నాయి. అఖరుకు ఇంట్లో టేబుళ్లు, కుర్చీలుకూడా వికలాంగులులాగా ఉన్నాయి. టేబులు ఫానుకు మూడు అకులు ఉండవలసింది రెండు అకులే ఉన్నాయి.

"ఏమిటి వీటి పరిస్థితి?" అనడిగాను చివరకు మిత్రత్వాన్ని దృష్టిలో పెట్టుకొని.

"ట్రాన్స్ఫర్ల ప్రభావం నాయనా! ఈఊరినుంచి ఆ ఊరికి, ఆఊరినుంచి మరో ఊరికి....ఇలా సంవత్సరానికొక ట్రాన్స్ఫరుతో ఇలా తయారయ్యాయి" అంటూ వాపోయాడు.

ఇద్దరమూ భోంచేసి బయటవరండాలో కూర్చున్నాము.

"ఏమీ అప్పారావుగారుదానా? పిల్లలూ అంతా క్షేమంగా ఉన్నారుదానా! అర్జంటు పనిదా ఉంది. రేపుదా కలుస్తా" చిరునవ్వులు చిందిస్తూ వెళ్ళిపోయాడు ముఖాన అడ్డనామాలు పెట్టుకొని పంచె ఎగగట్టిన ఓవ్యక్తి.

"ఎవరాయన?"

"మాఓనరుగాడు"

"అదేమిట్రా అంత మంచాయన్నుపట్టుకొని అలా అంటావు? పాపం ఇంట్లో వాళ్ళందర్నీ క్షేమసమాచారాలు అడిగాడుగదా!"

"రేపు జీతాలిచ్చే రోజు కదా. పువ్వులోని మకరందాన్ని గ్రోలినంత మృదువుగా మాదగ్గర అద్దె వసూలుచేస్తాడు. ఏమాత్రం బాధలేకుండా సిరంజిలోకి రక్తం లాగుతాడు"

"ఫాంటాస్టిక్ మాన్!"

"అవును" అన్నాడు.

తరువాత నన్ను లేవనీయకుండా తనకు ఓటెయ్యవలసిన అవశ్యకత గురించి ఏకధాటిగా రెండు గంటలసేపు ఉపన్యాస మిచ్చాడు. వస్తూంటే ప్రహరీ గోడ దగ్గరున్న కొళాయి దగ్గర భయంకరమైన పోరాటం. నీళ్ళకోసం ఆడవాళ్ళ సమరం. అద్దె కొంపల్లో ఇది మామూలే, స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్.

బ్రహ్మచారినైన నాకు అప్పారావు ఇంటి దగ్గరి అనుభవం కూర్చున్నా, లేచినా తలలో గిర్రున తిరుగుతూనే ఉంది. సంసారం సముద్రం అన్నది అప్పారావు విషయంలో యథార్థం. ఇంటిదగ్గర ఇన్ని బాధలూ పడుతూ అప్పారావు ఇంత జాగ్రత్తగా ఉద్యోగం ఎలా చేయగలుగుతున్నాడా అనేది అమితాశ్చర్యంగాఉంది. అతని ఓర్పుకూ, అద్దె ఇంట్లో నివసించే అతని నేర్పుకూ ఎంతగానో ఆశ్చర్యపోయాను.

"జగన్నాథం! నిన్న అద్దెకొంప అప్పారావు ఇంటికి పోయావటగదా! ఏం, నీ ఓటు అతనికేనా?" అని సొంత ఇంటి సుబ్బారావు నాసీటుకెదురుగా నిలబడి ఏడుపుగొంతుతో అనేసరికి ఉలిక్కిపడి తలెత్తాను.

"అలాంటిదేం లేదు సుబ్బారావుగారూ!"

"పోటీ అన్నపుడు పోటీయే. నీవు మాఇంటికికూడా రావాలి. వాడంత గొప్పా ఏం?" అన్నాడు.

దాంతో మరో ఆదివారం అతనింటికి పోక తప్పలేదు. లేక పోతే ఇప్పటినుంచే నన్నొక ప్రతిపక్ష సభ్యుడుగా చేసి మాట్లాడ గలడు.

సుబ్బారావిల్లు కనుక్కోవడం పెద్దకష్టమేమీ అనిపించ లేదు. ఊరికి దూరంగా విశాలమైన ఆవరణలో ఉన్న మేడ అది.

"రా! రా! జగన్నాథం!" అంటూ ఆప్యాయంగా పిలుస్తూ నాకోసమే అన్నట్లు బయట నిలబడి ఉన్నాడు సుబ్బారావు.

నేను అతన్ని అనుసరించాను.

"ఇది మేముండే పోర్షనోయ్" అంటూ కూర్చోబెట్టాడు.

"ఇదేమిటి? ఇంతపెద్దఇల్లూవదిలి ఒకవైపుగా ఉంటున్నారు?"

"ఏముందీ, ఇంతపెద్ద ఇల్లూ అప్పుచేసి కట్టించా అప్పు తీర్చాలిగదా! అందుకే ఇంటిని కింద రెండు పోర్షన్లు. పైన రెండు పోర్షన్లుగా విభజించి మిగతావి అద్దెకిచ్చి నేనీపోర్షన్లో ఉంటున్నా?"

అతని పిసినారితనానికి నాకు చాలా బాధకలిగింది. సొంత ఇల్లులేక బాధపడేవాళ్ళు చాలామంది. అయితే సొంత ఇల్లు ఉండీ ఇరుకుగదుల్లో బాధపడుతున్న సుబ్బారావునిచూస్తే నవ్వువస్తోంది. కాని అతనుచెప్పిందికూడా కొంత బాధాకరమైన వాస్తవం కావచ్చు.

"హలో సుబ్బారావుగారూ- హమ్మయ్య ఉన్నారా?" అంటూ బయటనుంచి ఎవరో అనడంతో సుబ్బారావుతోబాటు నేనూ బయటికి వచ్చాను.

"కూర్చోండి" అన్నాడు సుబ్బారావు ముభావంగా, ఆవ్యక్తిని ఉద్దేశించి,

ముగ్గురమూ మూడు కుర్చీల్లో కూర్చున్నాము

అంతలోనే "నాదగ్గర పదే ఉంది" అంటూ జేబులోంచి తీసిఇచ్చాడు సుబ్బారావు.

"మరీ పదేమిటండీ అసహ్యంగా! ఇంకో పది చూడండి" అన్నా డతను అది తీసి జేబులో పెట్టూకొంటూ.

''ఇంతకంటే ఎక్కువ లేవు సార్. ఐయామ్ వెరీ సారీ" అన్నాడు సుబ్బారావు ప్రతిమాలే ధోరణిలో.

"ఏం చేస్తాం? అంతా మాదురదృష్టం. ఇంతకుముందు మేమున్న చోటైతే మాడనరు ఎంతెంత ఇచ్చేవాడని? పాపం! అతను తిరిగి అడిగేవాడుకూడాకాదు." గొణుక్కుంటూ వెళ్ళి పోయాడతను.

"వాడెవరనుకొంటున్నావ్! పక్క పోర్షనులో అద్దెకుంటు న్నాడు. వాడో ఖూనీకోర్. ఇద్దరి భార్యలకు విషంపెట్టి చంపాడు. వాడి గత చరిత్ర తెలియక వాడి మాయ మాటలు నమ్మి ఇల్లి చ్చాను. ఇప్పటికి ఆరు నెలల అద్దెఇవ్వాలి. ఇప్పుడు వాడికి నేను పెట్టుబడి పెట్టవలసి వస్తోంది. వాడికి భయపడి...." నోరు తెరుచు కొని చూస్తున్న నాకు జవాబిచ్చాడు.

ఇంతలో మేడమీదినుంచి మృదంగ వాద్యం మొదల య్యింది హార్మోనియంతోబాటు. ''జండాపైకపిరాజు...." అంటూ పద్యం. హార్మోనియం. మృదంగం మోతలతో ఆప్రదేశమంతా హెూరెత్తిపోయింది.

"రామచంద్రా ఏమిటీ గోల! ఏమండీ మీరువెళ్ళి ఆ నాటక సమాజంవాళ్లని తరిమేయండి. ఎన్నిరోజులు పడతా మీ బాధ?" అంటూ వచ్చింది సుబ్బారావు భార్య కోపం అణుచుకుంటూ.

"ఎలాగే? వాళ్లు నాలుగునెలల అద్దె ఇవ్వాలి. వాళ్ళలో అసలువాడెవరో, స్నేహితులెవరో తెలియక చస్తున్నా, మొదట అద్దెవ్వాన్నిచ్చి చేరిన వాడిముఖం ఆరోజు చూశాను. మళ్ళీ ఇప్ప టికి కనిపించలా, వస్తే అంతా ఒకేసమయంలో వచ్చిచేరుతారు. మళ్ళీ ఒకేసారి అంతర్ధానమై పోతారు. ఎవరిని అడగాలి? ఎవ రిని కాదనాలి?" తల పట్టుకుని కూర్చున్నాడు సుబ్బారావు.

"వాళ్ళు అద్దె ఇచ్చినా ఇవ్వకపోయినా ఇంట్లోంచి తరి మెయ్యండి."

"అది నావల్లకాదే. నాలుగు నెలల అద్దె ఎనిమిది వందల రూపాయలు ఎలా వదులుకొనేది?"

"పదండి ఇద్దరం వెళ్ళి అడుగుదాం" అన్నాను సుబ్బా రావుని ప్రోత్సహిస్తూ.

ఇద్దరమూ మేడమీదకువెళ్ళి తలుపులు తట్టాము. చాలా సేపటికి తలుపులు తెరుచుకున్నాయి.

చప్పున కృష్ణపాత్రధారి వచ్చి సుబ్బారావు గడ్డం పట్టుకొని "బావా ఎప్పుడు వచ్చితీవు ఎల్లరున్ సుఖులేకదా" అంటూ పద్య మెత్తుకొన్నాడు. వీళ్ళు రిహార్సల్సులోకూడా మేకప్‌లో ఉంటారని నేనూహించలేదు. మళ్ళీ కృష్ణపాత్రధారి నావైపు చూసి "బావా! నీవెప్పుడు వచ్చితి? మున్మందుగ నే నర్జును జూచితి...." అంటూ నాభుజంమీద చేయివేసి పద్యం మొదలుపెట్టాడు. నేను మెల్లగా భుజంమీదున్న అతని చేతిని తొలగించాను.

"ఇంకా ఎన్ని నెలలని అద్దె బకాయి పెడతారు? అద్దె ఇచ్చి ఉండండి. లేకపోతే బయటికి నడవండి." గద్దించాడు సుబ్బారావు

"ఏమిటీ నువ్వు కృష్ణుడితోనే పరాచికాలాడుతున్నావా?"

"పరాచికా లాడటానికి రాలేదు. అద్దెఅడగడానికి వచ్చాము" అన్నాను నేనూ కోపంగా.

''మమ్మల్ని అడ్డె అడిగే నరాధము లెవ్వరు? మేము డిసెంబరు వరకు కంట్రాక్టుకు ఈపోర్షను మాట్లాడుకొని నరసరాజుకు డబ్బు ఇచ్చేశాం'' అన్నాడు భీముడు వేషధారి గద భుజంమీద పెట్టుకొని ముందుకు వస్తూ. తరువాత వరుసగా మిగతా పాండవులు, కౌరవులు ద్రౌపదితోసహా గుంపుగా చేరారు.

అందులోంచి ధర్మరాజు ముందుకు వచ్చి "కృష్ణా ఎందుకయ్యా మౌనంగా ఉంటావ్? నీవిశ్వరూపంచూపి ఆ ఇద్దరి నరాధములకూ మోక్షం కలిగించు" అన్నాడు.

"బావా నేనును అదియే ఆలోచించుచున్నాను. రుక్మిణీ!...." అంటూ పిలిచాడు.

"ఈరోజు రుక్మిణి రాలేదు కృష్ణా! వాళ్ళాయనకు ఒంట్లో బాగులేక ఇంట్లోనే ఉండిపోయింది. సత్యభామ ఉంది. రమ్మంటారా" అన్నాడు నకులుడు

''ఛ....వద్దనే వద్దు. మొన్న బస్ స్టాప్‌లో కనిపించింది 'ఓయీ సత్యా- ఒక్కసారి నా కౌగిలిలోకివచ్చి నాకోర్కె నెరవేర్చు' అన్నాను డ్రామాలో డైలాగు గుర్తొచ్చి. అంతే· ఫెడీమని కొట్టింది. చెంపపగిలిందనుకో. అందుకే దాన్ని పిలవకు" అన్నాడు కృష్ణుడు అప్పుడే దెబ్బతగిలినట్లు చెంప తడుముకుంటూ.

"అదీ గిదీ అనకు. మర్యాదగా మాట్లాడు, తప్పు నీది" అంటూ ముందుకు వచ్చింది సత్యభామ

చప్పున కృష్ణుడు ధర్మరాజు వెనుక దాక్కొని "తప్పు నాదికాదు. నీది. ఏదో నాహీరోయినువికదా. బస్‌స్టాపులో ఉన్న అందరికీ నా నటనా కౌశలం చూపుదామనుకొన్నాను. అందుకని రమ్మన్నంత మాత్రాన అంత దెబ్బ కొట్టా[illegible] ముందు నిన్నేం చేస్తానో" అన్నాడు వ్రేలు చూపిస్తూ.

తెలుగు విశ్వవిద్యాలయ
గ్రంథాలయం
సేకరణ సంఖ్య....41256....
తే....21.3.'95....

"నన్నేం చేస్తావ్? నీ బోడిబెదరింపులు నావగ్గర కావు" అంటూ ఘర్షకు దిగింది సత్యభామ.

క్షణంలో అక్కడున్న వాళ్ళంతా రెండు వర్గాలుగా చీలి పోయి గదులు, కత్తులు బాణాలు అందుకొని ఒకరి నొకరు తిట్టు కోవడం మొదలుపెట్టారు. నేను చప్పున తలుపు మూసి "సుబ్బా రావ్....కురుక్షేత్ర సంగ్రామం మొదలయింది. అందరూ కొట్టుకొని చస్తారు. తరువాత శవాలు ఎత్తేదానికి మునిసిపాలిటీవాళ్ళకు ఫోనుచేద్దాం. కొంతయినా భూభారం తగ్గుతుంది" అన్నాను.

నా మాటలకు సుబ్బారావు సంతోషిస్తాడనుకొన్నాను కాని సుబ్బారావు నోరెత్త లేదు. నేను ఆశ్చర్యంగా చూశాను.

"హు....నువ్వో పిచ్చివాడివి. ఇది నాకు ఆనందం కలిగి స్తుందని అనుకున్నట్లున్నావు. వాళ్ళు ఇప్పుడొక నాటకమడారంటే నువ్వు నమ్ముతావో నమ్మవో కాని నే నెప్పుడు అద్దె అడగడానికి వచ్చినా వాళ్ళిలాంటిదేదో ఒక నాటక మాడి ఘర్షణకు దిగుతూం టారు. ఇది నాకు మామూలే" అన్నాడు ఇప్పుడు ఆశ్చర్యపోవడం నావంతయింది.

సుబ్బారావింట్లో భోంచేయక తప్పలేదు. కొద్దిసేపు పేకాడు కొన్నాము. సాయంత్రం ఇంటికి బయలుదేరేముందు కాఫీతాగుతూ అన్నాను.

"ఇప్పటివరకు మీ ఇంట్లో రెండు పోర్షన్లలో ఉన్నవాళ్ళ సంగతే చెప్పావు. మేడమీదఉన్న ఇంకో పోర్షను వాళ్ళ సంగ తేమిటి?"

సుబ్బారావు విచారంగా ముఖంపెట్టి "వీళ్ళందరికంటే అది మరీ విచిత్రమైన కథ. సుమారు ఎనిమిది నెలల క్రితం రెండు నెలల అద్దె అడ్వాన్సిచ్చి వకవకా బీరువాలు, సోఫాలు

మిగతా ఫర్నిచర్‌తో చేరిపోయారు. వారంరోజులుండి ఏదో అర్జంటు పని తగిలిందని భార్యాభర్తలు ఇంటికి తాళంవేసుకొని వెళ్ళారు. ఇప్పటికీ తిరిగిరాలేదు. ఇంకో నాలుగు రోజులు చూసి పేపరు ప్రకటనిచ్చి అప్పటికీ రాకపోతే కోర్టువారిని దగ్గరపెట్టుకొని తలుపులు తీయిస్తాను. నాకు రావలసిన బాకీకి సరిపోయే సామాను జమ కట్టుకొని, మిగతా సామాను కోర్టుకి అప్పజెబుతాను'' అన్నాడు.

విచిత్రమైన పరిస్థితులలో సాలెగూటి మధ్య చిక్కుకొన్న సొంత ఇంటి సుబ్బారావువైపు జాలిగా చూసి అతని దగ్గర సెలవు తీసుకొని బయలుదేరాను. మేడిపండులా కనిపించే సొంత ఇంటి సుబ్బారావుకంటే వెలగపండులా పైకి కఠినంగా కనిపించే అద్దె ఇంటి అప్పారావు ఎంతో సుఖంగాఉన్నాడు.

అద్దె ఇంటి అప్పారావు ఇచ్చేవాడయితే, సొంత ఇంటి సుబ్బారావు పుచ్చుకొనేవాడు. ఎంతైనా ఇచ్చేవాడిదే పైచేయికదా! అయితే, ఈ ఎలక్షన్లో నే నెవరికీ ఓటు వేయదలుచుకోలేదు. కారణం! తన కొడుకుని అదుపులో పెట్టుకోలేని అసమర్థుడు అద్దె ఇంటి అప్పారావు. సొంత ఇల్లు ఉండీ అద్దెవాళ్ళలా సుఖ మెరుగని వాడు సొంత ఇంటి సుబ్బారావు. తమ సమస్యలను తామే పరిష్కరించుకోలేని వీళ్ళు ఇక ఉద్యోగుల సమస్యలను ఏవిధంగా పరిష్కరించగలరు?

★